క్లుప్తంగా

వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.ఈ మేరకు ధ్వజారోహణ, గోధూళిక, స్వామివారి కల్యాణం నిర్వహించారు. వేదపండితులు శ్రీనంబి వేణుగోపాలస్వామి కౌశిక ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న నాయకులు

గొల్లపల్లి: మండలంలోని మల్లన్నపేటకు చెందిన కండ్లె శ్రీకాంత్ భూటాన్‌లో జరిగే సాఫ్ట్ బాల్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. భారత్ తరఫున ఆడేందుకు వెళ్తున్న శ్రీకాంత్‌కు కాంగ్రెస్ ధర్మపురి నియోజకవర్గ సీనియర్ నాయకుడు మద్దెల రవీందర్, మాజీ సర్పంచ్ భీమ సంతోష్ చేతుల మీదుగా రూ.10వేలు అందజేశారు. బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు అవారి చందు రూ.5వేలు అందజేశారు. అనంతరం శ్రీకాంత్‌ను సన్మానించారు.

ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది



నువ్వు పంటను పరిశీలిస్తున్న సంజయ్

కోరుట్ల: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని మేడిపెల్లి, వేంపేట, యూసుఫ్‌నగర్, ధర్మారం, అయిలాపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. కోరుట్ల, మెట్‌పల్లి ఎంపీపీలు తోట నారాయణ, మారు సాయిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ఎంపీటీసీ గంగాధర్, నాయకులు సంజీవరెడ్డి, బద్దం తుక్కయ్య, సందయ్య పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం మక్కలకు క్వింటాల్‌కు రూ.1962 మద్దతు ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని డీసీఎంఎస్ చైర్మన్ ఎలాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా కోరుట్ల నియోజకవర్గంలో ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండల కేంద్రాల్లో మక్కల కొనుగోళ్లు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం దివ్యభారతి, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సర్పంచ్ నేమూరి లత, మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి ప్రకాష్, ఏడీఏ రమేశ్, మండల ప్రత్యేకాధికారి బాలె శివాజీ, తహసీల్దార్ మహేశ్వర్, ఏవో దీపిక, సింగిల్‌విండో చైర్మన్ బద్దం గోపి, వైస్ చైర్మన్ పవన్, ఎంపీటీసీ తిమ్మణి రాములు, ఉపసర్పంచ్ రాంరెడ్డి, సింగిల్‌విండో కార్యదర్శి మంత్రి సతీశ్, నాయకులు కమటం రమేశ్, నేమూరి సత్యనారాయణ, జాజాల జగన్‌రావు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

ధర్మపురి: మేడే కార్మికుల దినోత్సవం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం రూ.వెయ్యి జీతం పెంచడంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్ చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ధర్మపురిలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల అధ్యక్షుడు బడుగు లచ్చయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్‌చైర్మన్ రామన్న, కార్మికులు లక్ష్మి, రాములు, గంగమ్మ, లక్ష్మి ఉన్నారు.

కార్మికులకు వేతనాల పెంపుపై హర్షం

మెట్‌పల్లి: కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం రూ.వెయ్యి వేతనం పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో మంగళవారం మున్సిపల్ కార్మికులు టీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

నిలిచిన కల్వర్టు నిర్మాణ పనులు

- కోర్టును ఆశ్రయించిన బాధితులు
- పాత పద్ధతిలో నిర్మించాలని ఆందోళన
- వర్షాలు పడితే రాకపోకలకు ఇబ్బందే



నిలిచిన నిర్మాణ పనులు

రాయికల్: దశాబ్దాల క్రితం నుంచి రాయికల్-రామాజీపేట గ్రామాల మధ్య ఉన్న లోలెవెల్ వంతెనతో ప్రయాణికులు ఇబ్బంది పడుతుండగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కల్వర్టు నిర్మాణానికి రూ.1.40కోట్ల నిధులను మంజూరు చేయించారు. మార్చి 24న మంత్రి కొప్పుల ఈశ్వర్ నిర్మాణ పనులకు చేశారు. శంకుస్థాపన చేసిన ఆదిలోనే కల్వర్టు పక్కన ఉన్న భూమి పట్టాదారులు తమ భూములను ఆక్రమిస్తున్నారని కోర్టుకు వెళ్లడంతో కోర్టు స్టే ఇవ్వడంతో పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి.

వర్షాకాలం వస్తే తిప్పలే..

చిన్నపాటి వర్షాలకే గతంలో ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు నిలిచేవి. ఈ సమస్యను పరిష్కారం కోసం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బాక్స్ కల్వర్టు నిర్మాణం రూ.1.40కోట్లు మంజూరు చేయించారు. ఈ వ్యయంతో కల్వర్టు 13 మీటర్లు పొడవు, 3మీటర్ల ఎత్తుతో నూతన నిర్మాణ పనులను ప్రారంభించారు. గతంలో ఉన్న కల్వర్టులో మాత్రమే నిర్మించాలని కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నిర్మిస్తున్నారని కల్వర్టు పక్కనే ఉన్న పట్టాదారు యజమానులు తమ భూములు కోల్పోతున్నామని ఇటీవల కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిపివేయాలని కోర్టు స్టే విధించింది. దీంతో పనులు కాంట్రాక్టర్ తాత్కాలికంగా నిలిపివేశాడు. అసలే వర్షాలు పడడంతో చిన్నపాటి వర్షానికి సైతం తాత్కాలికంగా వేసిన రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ యాస్మిన్ బాషా, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి బాక్స్ కల్వర్టు నిర్మాణ పనులను పునఃప్రారంభించేలా చర్యలు చేపట్టాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

పాత పద్ధతిలోనే నిర్మించాలి



కల్వర్టు నిర్మాణ పనులను పాత పద్ధతిలోనే చేపట్టాలి. కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా చేపట్టడంతో కల్వర్టు చుట్టుపక్కల ఉన్న పట్టాదారుల భూములను అన్యాక్రాంతం అవుతున్నాయి. మాకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తాం.

– మోర నర్సయ్య, బాధితుడు

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే..

రాయికల్-రామాజీపేట గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు నిర్మాణ పనులు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారమే చేపడుతాం. గతంలో ఉన్న బిడ్జిపై మాత్రమే కల్వర్టు నిర్మిస్తాం. పట్టదారుల భూముల యజమానులు ఆందోళన చెందొద్దు. పనులకు సహకరించాలి.

– శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ

మన ఊరు-మన బడి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జాజాల భీమేశ్వరి

ఇబ్రహీంపట్నం: మన ఊరు-మన బడి పనులను వేగవంతం చేసి వచ్చే నెలలో పూర్తి చేయాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని గోధూర్ పాఠశాలలో మన ఊరు-మన బడి పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలకు రూ.33లక్షలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.29లక్షలు మంజురయ్యాయని, పనులు తీసుకున్న కాంట్రాక్టర్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సర్పంచ్ సోమ ప్రభాకర్, ఎస్‌ఎంసీ చైర్మన్లు ఓంకారి రాము, బండి గంగారెడ్డి, వీడీసీ చైర్మన్ బూరం సంజీవ్, ఉపసర్పంచ్ నల్ల తిరుపతిరెడ్డి, నాయకులు కోటగిరి వెంకటస్వామి, జాజాల జగన్‌రావు, దేవదాస్ పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి ఉత్సవాలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఆలయ చైర్మన్

మల్యాల: మండలం ముత్యంపేటలోని శ్రీకొండగట్టు అంజనేయస్వామి జయంతి ఉత్సవాలకు మంత్రి కొప్పుల ఈశ్వర్, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆలయ ఫౌండర్ ట్రస్టీ మారుతి, ఈవో వెంకటేశం ఆహ్వాన పత్రిక అందించారు. కాగా మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో కలిసి 12 నుంచి 14 వరకు నిర్వహించే జయంతి ఉత్సవాలకు రావాలని ఆహ్వానం పలికారు. సూపరింటెండెంట్ సునీల్ ఉన్నారు.

ఆత్మగౌరవ బహిరంగ సభను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కోరుట్ల: ఈ నెల 7న నిర్వహించే తెలంగాణ ఆత్మగౌరవ బహిరంగ సభను జయప్రదం చేయాలని బీఎస్పీ నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి ముఖ్య అతిథిగా వస్తున్నారని తెలిపారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు మారంపెల్లి శ్రీధర్, పట్టణ ఇన్‌చార్జి తెడ్డు శేఖర్, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, రాజేశ్, అరవింద్, నీలకంఠం, వెంకటేశ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కథలాపూర్: 7న హైదరాబాద్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ భరోసా సభ పోస్టర్‌ను మంగళవారం కథలాపూర్‌లో బీఎస్పీ నాయకులు ఆవిష్కరించారు. బీఎస్పీ మండలాధ్యక్షుడు శేఖర్, నాయకులు నీలకంఠం, సంజీవ్, అర్జు న్, మహేశ్, ఆనందం, వర్ధన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సమస్యలపై పెన్షనర్స్ సంఘం వినతి



వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్స్

జగిత్యాల: తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా అధక్షుడు హరిఅశోక్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ట్రెజరీ అధికారి సీహెచ్.సోఫియాకు పెన్షనర్లు వినతిపత్రం అందించారు. ప్రతినెలా పెన్షనర్స్ నుంచి ఆదాయ పన్ను పెన్షన్ నుంచి మినహాయింపు వద్దన్నారు. వివిధ టాక్స్ మినహాయింపులు చేసుకున్న వారికి సైతం పన్ను మినహాయింపులు ఉంటాయని తెలిపారు. పెన్షనర్ల సంఘం కార్యవర్గం బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, హన్మంతరెడ్డి, ప్రకాష్, యాకూబ్, కరుణ, అశోక్‌రావు, సత్యనారాయణ, రాజేశ్వర్, శివ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు కళాబృందం

గొల్లపల్లి: రోడ్డు భద్రతపై అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా పోలీస్ కళాబృందం గొల్లపల్లిలో మంగళవారం అవగాహన కల్పించారు.

సమస్యలు పరిష్కరించాలి



సమ్మె నోటీసు ఇస్తున్న కారోబార్లు, బిల్ కలెక్టర్లు

మెట్‌పల్లి: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కారోబార్లు మంగళవారం మండల పరిషత్ సూపరింటెండెంట్ నర్సింహారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. సంఘం అధ్యక్షులు రాములు, గణపతి, కృష్ణ, శేఖర్, శ్రీనివాస్, వినోద్, గంగరాజం, గంగు, లక్ష్మీనర్సు, రాజు ఉన్నారు.

సమ్మె నోటీసులు అందజేత

ఇబ్రహీంపట్నం: తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని లేకుంటే 5 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ జాజాల భీమేశ్వరి, ఎంపీవో కృపాకర్‌కు కారోబార్లు, బిల్ కలెక్టర్లు సమ్మె నోటీస్ అందజేశారు. జిల్లపెల్లి రమేశ్, నీరేటి రతన్, మర్రిగడ్డ జగన్, దాసరి దేవేందర్, సుమంత్, బిక్కు నాయక్, గోవర్ధన్, రాజేందర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు చెల్లించడం లేదని ఆందోళన

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అంగడిబజార్ ప్రాంతానికి చెందిన ఓ టైలర్ నిర్వహిస్తున్న వ్యక్తి పలువురి నుంచి పెద్ద ఎత్తున అప్పులు తీసుకున్నారు. కొద్దికాలంగా అప్పు ఇచ్చినవారంతా అప్పు చెల్లించాలని ఒత్తిడి చేస్తుండగా, అప్పు చెల్లించకుండా ఐదురోజుల క్రితం పరారయ్యాడు. దీంతో బాధితులంతా పరారైన వ్యక్తి కోసం గాలిస్తుండగా మంగళవారం సాయంత్రం సదరు వ్యక్తి అతడి ఇంటికి చేరినట్లు తెలుసుకొని బాధితులంతా అతడి ఇంటికి వెళ్లి అప్పు చెల్లించాలని ఆందోళన చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పట్టణ ఎస్సై సందీప్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడి అప్పు తీసుకున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు.

సంక్షిప్త వార్తలు

✦ వరదకాలువ గట్టుల పరిశీలన

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల, కథలాపూర్, దూలూర్, తక్కళ్లపెల్లి, దుంపేట గ్రామశివారులో ఎస్సారెస్పీ వరదకాలువ గట్టులను మంగళవారం ఎంపీడీవో జనార్దన్, నీటిపారుదలశాఖ ఏఈ గంగాధర్ పరిశీలించారు. హరితహారంలో మొక్కలు నాటేందుకు అనువైన స్థలం కోసం పరిశీలించారు. వారి వెంట ఏపీవో రాజేందర్, టీఏ శ్రీధర్, కార్యదర్శి ఎం.డీ గఫూర్ తదితరుల ఉన్నారు.

✦ తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన వరి, మొక్కజొన్న, నువ్వుల పంట రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్‌కు మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోతున్నా, ధాన్యం తూకం వేయడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పంటల బీమా పథకం కూడా అమలులో లేని పరిస్థితుల్లో పంట నష్టపోయిన రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యతగా తక్షణమే ఎకరాన రూ.20వేల పరిహారం అందజేయాలని కోరారు.

✦ తడిచిన ధాన్యం పరిశీలన

జగిత్యాలరూరల్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంకాలి రాజన్న అన్నారు. ఈ మేరకు జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్, అర్బన్ మండలం ధరూర్ గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు.

✦ కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయి

జగిత్యాల: గత యాసంగితో పోలిస్తే ఈ యాసంగిలో వరిధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లాలోని వరిధాన్యం కొనుగోళ్లపై జిల్లా సహకార, జిల్లా వ్యవసాయశాఖ, రైస్‌మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 1809 మంది రైతుల నుంచి 1,70,764 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి 17శాతం తేమ వచ్చిన తర్వాత ధాన్యం కేంద్రాలకు తీసుకొచ్చే విధంగా రైతులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏదైనా కొనుగోళ్లలో సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 18004258187కు ఫోన్ చేయాలని సూచించారు.

మండల అధ్యక్షుడికి సన్మానం

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ ఫిషర్‌మెన్ రాయికల్ మండల అధ్యక్షుడిగా ఎంపికైన పల్లికొండ రమేశ్‌ను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మంగళవారం సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు తోపారపు రజనీకాంత్, నాయకులు మేకల రమేశ్, రాజు, రాజేందర్, శ్రీహరి, రవి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

✦ వ్యక్తిపై కేసు

సారంగాపూర్: బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొల్వాయి గ్రామ శివారుల్లో బైక్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపిన మడిగెల శ్రీనివాస్ అనే వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

బాలుడి వైద్యానికి ఎంపీ అర్వింద్ చేయూత



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన ఏనుగుల శివకేశవ్ అనే బాలుడికి కొద్దిరోజులుగా శ్వాసకోస, గుండె, ఊపిరితిత్తుల సమస్యతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మంగళవారం అసుపత్రికి వెళ్లి శివకేశవ్ వైద్యఖర్చుల కోసం అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ ద్వారా రూ.1.50లక్షలు అందజేశారు.

సీఎం సహాయనిధితో పేదలకు భరోసా



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల: సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు భరోసానిస్తోందని, పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు సాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఈ మేరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 12మంది లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.3లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, సర్పంచ్‌లు బద్దం తిరుపతిరెడ్డి, గొడుగు కుమారస్వామి, కొంక నర్సయ్య పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

మండలంలోని నూకపల్లికి చెందిన నిరుపేద ఎ.జమున అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే రవిశంకర్‌ను సంప్రదించగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష విలువైన ఎల్‌వోసీ అందజేశారు.

నాణ్యమైన పరికరాలతో ప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సారంగాపూర్: నాణ్యమైన విద్యుత్ పరికరాలు వినియోగిస్తే ప్రమాదాలు నివారించే వీలుందని ఎన్పీడీసీఎల్ ఏఈ సతీశ్ తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు, పలు సమస్యలు, జాగ్రత్తలపై గ్రామస్తులకు మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏఈ మాట్లాడుతూ, విద్యుత్ మోటారు స్టార్ట్ చేశాక మోటారు, పైపులు, ఇతర పరికరాలను ఎట్టిపరిస్థితుల్లోనూ తాకకూడదన్నారు. వర్షాలు, గాలులకు తీగలు తెగిపడినా, సతంభాలు విరిగి పడినా వాటిని తాకవద్దని, వెంటనే అధికారులు, సిబ్బందికి సమాచారం చేరవేయాలని కోరారు. ఐఎస్ఐ మార్కు ఉన్న నాణ్యమైన పరికరాలు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రాల రాజేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఏలూరి గంగారెడ్డి, లైన్‌మన్ ప్రసాద్, జూనియర్ లైన్‌మెన్ పరుశురాం, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై చిరంజీవి

మల్యాల: యువత సైబర్ నేరాల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మల్యాల ఎస్సై చిరంజీవి అన్నారు. ఈ మేరకు మండలంలోని రామన్నపేట గ్రామంలో మంగళవారం రాత్రి ప్రజలకు సైబర్ నేరాల నియంత్రణ, డయల్ 100, సీసీ కెమెరాలతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని తద్వారా రోడ్డు ప్రమాదాలు నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం జలజ మల్లారెడ్డి, వలీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఆంక్షలు ఎత్తివేయండి

సారంగాపూర్: వరిధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆంక్షలను ఎత్తివేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు, రైతు ఐక్యవేదిక జిల్లా మాజీ అధ్యక్షుడు పన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని అర్పపల్లిలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు పెట్టకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్, పార్టీ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, సంతోష్, జీవన్, వేణు, రామ్‌రెడ్డి, నక్క జీవన్, మహేశ్, అఖిల్, రాజు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అంకతి రాజన్న

ఇబ్రహీంపట్నం: రైతులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని యామపూర్ సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్న కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని వేములకుర్తిలో యామపూర్ సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్‌లు అవుల మహేశ్, దాసరి పోశెట్టి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ ఆరె గంగారెడ్డి, కేడీసీసీ మాజీ డైరెక్టర్ ఆరె రాజ్‌కుమార్, ఉపసర్పంచ్ అసతి పెద్ద రాజం, నాయకలు దేశెట్టి రాజరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు గుజ్జె గంగాధర్, దొనికెన రాజేశ్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

కథలాపూర్: మండలంలోని రాజారాం తండా గ్రామశివారులో మంగళవారం విద్యుత్‌షాక్ తగిలి ఆవు మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. కొచ్చెగుట్ట తండాకు చెందిన లకావత్ రెడ్యా ఆవులను గడ్డి మేపేందుకు రాజారాం తండా శివారుకు తీసుకొచ్చారు. ఈక్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న వైరు ఆవుకు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. రూ.50వేల విలువగల ఆవును కోల్పోయానని ప్రభుత్వం, ట్రాన్స్‌కో అధికారులు ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

కొనసాగుతున్న కార్యదర్శుల నిరవధిక సమ్మె



సారంగాపూర్‌లో కార్యదర్శుల నిరసన

జగిత్యాలరూరల్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేసేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం జగిత్యాల రూరల్ మండలం పంచాయతీ పరిషత్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె ఐదోరోజు కొనసాగింది.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.

రాయికల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రాయికల్ పట్టణంలో ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.

కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

మెట్‌పల్లి: సమ్మె శిబిరాన్ని పంచాయతీ కారోబార్లు సందర్శించి సమ్మెకు సంఘీభావం తెలిపారు.

ఇబ్రహీంపట్నం: పంచాయతీ కార్యదర్శులను, ఔవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని టీజేఎస్ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. 5వ రోజు సమ్మె కొనసాగింది.

పెగడపల్లి: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు.

కోరుట్లరూరల్: తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె 5వ రోజుకు చేరింది.

హద్దులు చూపించాలి

కోరుట్ల: పట్టణంలోని సర్వే నెంబర్ 1356ను ఆనుకుని ఉన్న 33 ఫీట్ల ఆదిరస్తాకు సంబంధించిన వివరాలు, హద్దులు తెలపాలని ఎక్కల్‌దేవి బాగిర్త, ఎక్కల్‌దేవి ప్రభాకర్ తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ అధికారులు ఇచ్చిన లేఖను తహసీల్దార్‌కు అందించారు. ఈ విషయంపై మార్చి 21న మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నామని మున్సిపల్ అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని తమకు లేఖ ఇచ్చారని పేర్కొన్నారు. కావున రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 1356లో గల ఆదిరస్తా 33 ఫీట్ల హద్దులు చూపించాలని కోరారు. ఈ విషయంపై ఆర్డీవోకు కూడా వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు.